## క్లుప్తంగా

### నేటి నుంచి అమ్మవారి ఉత్సవాలు



సీలేరు: గూడెం కొత్తవీధి మండలం సీలేరు జలవిద్యుత్‌కేంద్రం వద్ద వెలిసిన నూకాంబిక అమ్మవారి ఉత్సవాలు గురువారం నుంచి అయిదు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం గణపతి పూజ చేసి అమ్మవారి గరగాలంకరణ కార్యక్రమంతో ప్రారంభమవుతుందన్నారు. 29న కొత్త అమావాస్య రోజున ప్రధాన పండుగ జరుగుతుందని, ఆ రోజు భక్తులు తమ మొక్కులు తీర్చుకోవచ్చని పేర్కొన్నారు. 30వ తేదీన అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి ఆలయ మహాద్వారం మూసివేసి ఏప్రిల్ 1న అమ్మవారికి మరుపూజ నిర్వహించి భక్తులకు పునఃదర్శనం కల్పిస్తామని చెప్పారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

### కంచాలు పంపిణీ



కంచాలు పంపిణీ చేస్తున్న దాతలు హెచ్‌ఎం వరహాలబాబు, సూరిబాబు

కొయ్యూరు: మండలంలో రేవళ్ల పాఠశాలలో బుధవారం విద్యార్థులకు కంచాలు పంపిణీ చేశారు. దాతలు మూలపరి సూరిబాబు, పాఠశాల హెచ్‌ఎం వేంపాటి వరహాల బాబు ఆధ్వర్యంలో వాటిని విద్యార్థులకు అందజేశారు. మాజీ సర్పంచ్ కొండమ్మ, స్థానికులు లవకుశ, నాగు, పావని తదితరులు పాల్గొన్నారు.

### రైతు గుర్తింపు కార్డులను ఆన్‌లైన్ చేసుకోవాలి

చింతపల్లి: మండలంలో గల రైతులు విధిగా రైతు గుర్తింపు కార్డులను ఆన్‌లైన్ చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఆన్‌లైన్ కార్యక్రమం ప్రారంభమైనట్లు చెప్పారు. పీఎం కిసాన్ లబ్ధిదారులకు, జిరాయితీ పట్టాదారులకు మొదట ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్డు ద్వారా రైతులు వ్యవసాయ అనుబంధశాఖ ద్వారా రాయితీ పథకాలు పొందవచ్చునన్నారు. విత్తనాలు, వ్యవసాయ పరికరాలు తదితర పథకాలకు ఈ రిజిస్ట్రేషన్ అవసరమని తప్పక రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్ చేసుకోవాలని ఏఓ తెలిపారు.


### సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



గుర్రాలగొందిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి వినయ్‌కుమార్

గూడెంకొత్తవీధి: ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా చాలా వరకూ వ్యాధులు రాకుండా నియంత్రించవచ్చని గూడెంకొత్తవీధి పీహెచ్‌సీ వైద్యాధికారి వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని రింతాడ సచివాలయం పరిధిలోని గుర్రాలగొంది గ్రామంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ నిర్మల, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి సచివాలయం ఏఎన్‌ఎం కుమారి, 104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### విద్యార్థినికి అభినందనలు



భవ్యశ్రీ

రాజవొమ్మంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న కదుల్ల భవ్యశ్రీ నవోదయ విద్యాలయంలో ప్రవేశానికి అర్హత సాధించినట్లు హెచ్‌ఎం. గోపాలకృష్ణ తెలిపారు. నవోదయ ప్రవేశ పరీక్షలో భవ్యశ్రీ 80 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. తమ కుమార్తె నవోదయకు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు రామకృష్ణ, స్వరూపరాణి ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థిని భవ్యశ్రీకి పలువురు అభినందనలు తెలిపారు.

### కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

చింతపల్లి: మండలంలోని తాజంగి కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సుమమాధురి తెలిపారు. విద్యాలయంలో 6వ తరగతిలో-40 సీట్లు, 7వ తరగతిలో-1, 9వ తరగతిలో-1తో పాటు ఇంటర్ మొదటి సంవత్సరంలో-40 ఖాళీలున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 11 తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# ఆశల సాగు



వనభరంగిలో వరి సాగు
(ఇన్‌సెట్) కొమ్ముశనగ దిగుబడిని చూపిస్తున్న రైతు సోమయ్య

**కొండవాలు ప్రాంతాల నుంచి నీరు మళ్లింపు**

**120 ఎకరాల్లో వరి సాగు**

పెదబయలు:

మండలంలోని రబీ వరి సాగు గతంలో కంటే తక్కువ విస్తీర్ణంలో పండిస్తున్నారు. సాగునీటి సమస్య ఉండడంతో కొండవాలు, చెక్ డ్యాంల ద్వారా నీరు మళ్లించి వరి సాగు చేస్తున్నారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీలో 120 ఎకరాల్లో వరి సాగు జరుగుతుంది. మండలంలోని ఎక్కువగా అరడకోట, బొండాపల్లి, కిముడుపల్లి, గలగండ, వనభంగి, కుంతుర్ల, లక్ష్మీపేట, పోయిపల్లి. పెదకోడాపల్లి పంచాయతీల్లో వరి పండిస్తున్నారు. ప్రస్తుతం నీటి సమస్య వెంటాడుతుండడంతో తక్కువ విస్తీర్ణంలో పండిస్తున్నామని రైతులు చెబుతున్నారు. మండలంలోని కిముడుపల్లి పంచాయతీ వనభరంగి గ్రామంలో సుమారు 20 మంది రైతులు పెద్ద ఎత్తున వరి సాగు చేపట్టారు. కొండవాలు ప్రాంతం నుంచి నీరు మళ్లించి వరి పండిస్తున్నారు. గ్రామంలో సుమారు 30 ఎకరాల్లో సాగు చేశారు. అలాగే వరి పంటకు ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా సేంద్రీయ ఎరువులను వినియోగిస్తున్నట్లు గిరిజన రైతులు చెబుతున్నారు. పంటను రక్షించేందుకు పొలం చుట్టూ రక్షణ కంచె ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి సాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

**రబీలో కొమ్ముశనగ సాగు**

గూడెంకొత్తవీధి: సాధారణంగా గిరిజన ప్రాంతాల్లో రైతులు కేవలం ఖరీఫ్‌లోనే పంటలను సాగు చేస్తారు. రబీ అంతా పొలాలను ఖాళీగా ఉంచుతారు. దీనివల్ల రైతుల పొలాలన్నీ వృథాగా కనిపిస్తుంటాయి. నీటి సదుపాయం లేకపోయినా కేవలం మంచు సహాయంతో పండే కొమ్ముశనగ పంటను చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ప్రయోగాత్మకంగా గూడెంకొత్తవీధి మండలం దామనాపల్లి గ్రామంలో కొడా సోమయ్య అనే గిరిజన రైతు పొలంలో ఇటీవల సాగు చేశారు. అది మంచి ఫలితాలను ఇచ్చింది. నంద్యాల బెంగాల్‌గ్రాం అనే దేశవాళీ కొమ్ముశనగ విత్తనాలను ఒక ఎకరాలో వేశారు.గత ఏడాది నవంబరులో విత్తిన పంట ఈ ఏడాది ఫిబ్రవరి 22న కోతకు వచ్చింది. పంట విత్తే సమయంలో మినహా ఇక ఎటువంటి నీటి తడులు లేకపోయినా కేవలం మంచు సహాయంతో ఈ పంట మంచి దిగుబడులను ఇచ్చినట్లు చింతపల్లి విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ బాలహుస్సేన్‌రెడ్డి తెలిపారు. ఎకరాకు 280 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. పెట్టుబడి ఖర్చులన్ని పోగా నికరంగా సుమారు రూ.15,700 వరకూ ఆదాయం వచ్చినట్లు వివరించారు.ఈ క్షేత్రాన్ని వ్యవసాయాధికారి మధుసూదనరావు, శాస్త్రవేత్తలు పరిశీలించారు. రానున్న కాలంలో రబీలో మండల వ్యాప్తంగా కొమ్ముశనగ సాగును విస్తరించనున్నట్లు వారు తెలిపారు.



దామనాపల్లిలో కొమ్ముశనగ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారి

**ఆశాజనకంగా దిగుబడి**



పంటకు నీరు అందించడం ఇబ్బందిగా ఉంది. పశువుల నుంచి రక్షించుకోవడం చాలా ముఖ్యం. సాగుకు ఎలాంటి రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా పశువుల పేడ, మూత్రం ఉపయోగించిన సేంద్రియ ఎరువులే వాడి సాగు చేస్తున్నాం. ఏటా దిగుబడి బాగానే వస్తుంది.

– మర్రిచెట్టు అప్పలనాయుడు, రైతు కుడాసింగి గ్రామం

**సేంద్రియ ఎరువులతోనే సాగు**



రబీ వరి పంట విస్తీర్ణం తగ్గింది. మండలంలో 120 ఎకరాల్లో సాగు చేపట్టారు. పంట పొట్టదశలో వచ్చే సరికి నీరు పుష్కలంగా అందక పంట పాడవుతున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో కొన్ని పంచాయతీల్లో రైతులు కొండవాల ప్రాంతాల నుంచి, చెక్‌డ్యాంల ద్వారా నీరు మళ్లించి సాగు చేస్తున్నారు. పూర్తిగా సేంద్రీయ ఎరువులతోనే సాగు చేస్తున్నారు.

–అద్దూరు. శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి, పెదబయలు మండలం

## హైవేపై విద్యుత్ కాంతులు

- లైట్ల వెలుగులో కళకళలాడుతున్న జాతీయ రహదారి

గంగవరం: గంగవరంలో 516ఈ జాతీయ రహదారి నిర్మాణంతో గ్రామం రూపు రేఖలు మారిపోయాయి. ఈ జాతీయ రహదారి గంగవరం మీదుగా ఐ.పోలవరం జంక్షన్ వరకు నిర్మిస్తున్నారు. జాతీయ రహదారి నిర్మాణంతో గంగవరం -అడ్డతీగల, రంపచోడవరం మార్గం అభివృద్ధి చెందింది. రహదారి నిర్మాణ సమయంలో హైవేపై భారీ లైట్లు ఏర్పాటు చేసినా వాటికి విద్యుత్ సరఫరా ఇవ్వలేదు. రహదారికి సమీపంలో పాత విద్యుత్ స్తంభాలను తొలగించి నూతనంగా స్తంభాలు వేసే సమయంలో లైట్లును తొలగించారు. దీంతో వీధిలైట్లు లేక చాలా కాలంగా గంగవరం సెంటర్ నుంచి పాత బ్యాంక్‌వీధి వరకు రహదారి అంతా చీకటి మయమే. దీంతో రాత్రి సమయాల్లో రహదారిపై నడవాలంటేనే స్థానికులు భయపడేవారు. ఇది కాగా జాతీయ రహదారిపై భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాల రాకపోకలు బాగా పెరిగాయి. వేగంగా వాహనాలు నడుపుతుండంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తరచూ హైవే పై ప్రమాదాలు జరుగుతుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇటీవల గంగవరం సమీపంలోని హైవే పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఎస్‌ఐ రాంబాబు ఆధ్వర్యంలో హెచ్‌సీ రాంబాబు పోలీసు తనిఖీల్లో భాగంగా రహదారి భద్రతపై వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులు హైవేపై వీధిలైట్ల సమస్యను పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై హెచ్‌సీ ఎం.రాంబాబు చొరవ తీసుకొని హైవే సిబ్బందితో ఫోన్‌లో విషయాన్ని తెలియజేశారు. దీనిపై హైవే సిబ్బంది స్పందించి విద్యుత్‌శాఖ సిబ్బందితో చర్చించి జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లను వెలిగించారు. ఇందులో భాగంగా గంగవరం సెంటర్ నుంచి పాత బ్యాంక్‌వీధి వరకు వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గంగవరం గ్రామం విద్యుత్ కాంతులతో కళకళలాడుతోంది. పలువురు జాతీయ రహదారిపై విద్యుత్‌కాంతుల నడుమ సెల్ఫీలు, వీడియోలు తీసుకున్నారు. చొరవ చూపిన హెచ్‌సీ రాంబాబు, స్థానిక విలేకరులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



గంగవరంలో హైవేపై విద్యుత్ వెలుగులు

## పశువుల కోసం నీటి తొట్టెలు

రాజవొమ్మంగి: వేసవి దృష్ట్యా మండలంలోని ప్రతి గ్రామంలో పశువుల కోసం నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఉపాధి హామీ ఏపీవో రెడ్డిబాబు తెలిపారు. స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్లు గ్రామంలో నీటి వనరులు ఉన్న స్థలాన్ని ఎంపిక చేసి నీటి తొట్టెల నిర్మాణం కోసం కొలతలు తీసి అంచనా వ్యయం సిద్ధం చేయాలని ఆదేశించారు. ఒక్కో పశువుల తొట్టె నిర్మాణానికి రూ.32వేలు ఖర్చు అవుతున్నట్లు అంచనా వేశామన్నారు. అదే విధంగా ఉపాధి పనులకు ప్రస్తుతం రోజు వారీ 1,872 మంది వస్తున్నారని, ఈ సంఖ్యను మూడు వేలకు పెంచాలని సిబ్బందికి సూచనలిచ్చారు. మండలంలో వంద రోజుల పనిని పూర్తి చేసిన కుటుంబాలు 3,200 ఉన్నట్లు చెప్పారు. ప్రతి కుటుంబం 100 రోజుల పని పూర్తి చేసేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రతి పంచాయతీకి లక్ష్యం మేరకు 25 ఫారంపాంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఇప్పటికే మంజూరైన సోక్‌పిట్స్ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. మండలానికి రెండు పుష్కర వనాలు మంజూరైనట్లు ఏపీఓ వెల్లడించారు. సాగునీటి చెరువులను ఎంపిక చేసి వాటి చుట్టు కంచె ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే చెరువుగట్లపై మొక్కలు పెంచడంతో పాటు, సందర్శకుల కోసం వాకింగ్ ట్రాక్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు



సూచనలిస్తున్న ఉపాధి ఏపీవో రెడ్డిబాబు

### ఉపాధ్యాయునికి అభినందనలు



ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా పదోన్నతి పొందిన కామేశ్వరరావును అభినందిస్తున్న ఉపాధ్యాయులు


గూడెంకొత్తవీధి: గూడెంకాలనీకి చెందిన ఉపాధ్యాయుడు ముక్కలి కామేశ్వరరావుకు ఎల్‌ఎఫ్.ఎల్ హెచ్‌ఎంగా పదోన్నతి లభించింది. ఈయన సుమారు 40 ఏళ్లుగా ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం గూడెంకొత్తవీధిలో జీపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న ఆయనను విద్యాశాఖ అధికారులు పదోన్నతి కల్పించి గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా నియమించారు. ఈ సందర్భంగా రామరాజు తదితర ఉపాధ్యాయులు పదోన్నతి పొందిన కామేశ్వరరావును అభినందించారు.

### సారా స్వాధీనం- ఒకరి అరెస్టు

చింతపల్లి: మండలంలో నిర్వహించిన దాడుల్లో నాలుగు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఒక మహిళను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ జె.కూర్మారావు తెలిపారు. మండలంలోని రింతాడ పంచాయతీ పరిధిలో ఈ దాడులు నిర్వహించినట్లు చెప్పారు.ఈ దాడిలో రింతాడకు చెందిన మహిళ నుంచి నాలుగు లీటర్లు సారాను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఈ దాడుల్లో కానిస్టేబుళ్లు ఆర్.డి.రాయుడు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తి చేయాలి

అడ్డతీగల: లక్ష్యానికి అనుగుణంగా నూరుశాతం పనులు పూర్తి చేయాలని ఉపాధి హామీ ఏపీవో పి.అరవాలు అన్నారు. ఉపాధి హామీ కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పరిధిలో 250 ఫారం పాండ్లు మంజూరు కాగా ఇప్పటికే 125 నిర్మించినట్టు చెప్పారు. మిగిలినవి త్వరితగతిన నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 642 సోక్‌పిట్స్ నిర్మించాలనేది లక్ష్యం కాగా 210 పూర్తిచేశారన్నారు. 2,001 మందితో 100 రోజుల పనిదినాలు పూర్తిచేసినట్టు తెలిపారు. పనులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సామాజిక తనిఖీకి సిద్ధం చేయాలని ఆదేశించారు. జరిగిన పనుల బిల్లుల విడుదలకు అనుగుణంగా ఎంబుక్‌లను టెక్నికల్ అసిస్టెంట్‌లకు అందజేశామన్నారు.



క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఉపాధిహామీ ఏపీవో అరవాలు

### అంగన్‌వాడీ హెల్పర్‌కు పదోన్నతి

ముంచంగిపుట్టు: మండలంలోని జర్రెల పంచాయతీ డేగలపుట్టు గ్రామంలోని అంగన్‌వాడీ హెల్పర్‌గా పని చేస్తున్న శ్రీదేవికు అంగన్‌వాడీ కార్యకర్తగా పదోన్నతి కల్పిస్తూ నియామకపత్రాన్ని బుధవారం సీడీపీవో వరహాలమ్మ అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీవో వరహాలమ్మ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కార్యకర్తగా నియమించినట్లు తెలిపారు. ఈ మేరకు పదోన్నతి పత్రం అందించినట్లు పేర్కొన్నారు. బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు.



అంగన్వాడీ కార్యకర్త శ్రీదేవికి పదోన్నతిపత్రం అందిస్తున్న సీడీపీవో వరహాలమ్మ

### హెల్త్ క్లినిక్ సెంటర్‌లో టాస్క్‌ఫోర్స్ తనిఖీ

గొలుగొండ : గుండిపాల హెల్త్ క్లినిక్ కేంద్రాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారి జగదీష్,, జిల్లా అదనపు వైద్యాధికారి ప్రశాంతి బుధవారం పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యాధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఇక్కడ ఉన్న సౌకర్యాలు, మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మంచి వైద్య సేవలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. వైద్యాధికారులు మధుసూదనరావు, ధనుంజయ్ , సీహెచ్‌వో ప్రసాద్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ముక్కుమూసుకోవాల్సిందే

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని ఎంపీడీవో క్వార్టర్స్‌లో ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయింది. గత కొద్ది రోజులుగా చెత్త తొలగించకపోవడంతో దారుణంగా ఉందని, దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముక్కుమూసుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోందని చెబుతున్నారు. రోజులతరబడి పేరుకుపోయిన చెత్త వలన దోమలు, ఈగల బెడద చాలా ఎక్కువగా ఉందని, రోగాలు ప్రబలుతాయని ఆందోళన చెందుతున్నారు. తీవ్ర దుర్గంధంతో నివసించలేకపోతున్నామని చెబుతున్నారు. సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



ఎంపీడీవో క్వార్టర్స్ వద్ద పేరుకుపోయిన చెత్త

## ఘనంగా నూకాలమ్మ తల్లి ఉత్సవాలు ప్రారంభం

అడ్డతీగల: మండలంలోని దుశ్చర్తిలో నూకాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.అమ్మవారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రాలను అలంకరించి కుంకుమార్చన కార్యక్రమాలను జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న జాతరలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజాధికాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.



నూకాలమ్మ అమ్మవారు

## ప్రీ ప్రైమరీ విద్యాభివృద్ధికి కృషి

పెదబయలు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్యాభివృద్ధికి అంగన్‌వాడీలు కృషి చేయాలని ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలూర పాఠశాల-1 లో అంగన్‌వాడీలకు కేంద్ర ప్రభుత్వం చేట్టిన పోషణ్ భీ.. పడాయి భీ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ప్రీ ప్రైమరీ విద్య బోధన పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పూర్ణయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. ప్రీ ప్రైమరీలో బాగా బోధిస్తే ప్రాథమిక పాఠశాలల్లో చేరిన తరువాత పిల్లలు మరింత చురుగ్గా నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులకు మంచి పునాది పడుతుందన్నారు.

## రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు రూరల్: పాడేరు డివిజన్ పరిధిలోని వివిధ మండలాల్లో శుక్రవారం ఆయా సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్‌లైన్‌ల మరమ్మతు పనుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఎ.వి.ఎస్.ఎం.అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా హుకుంపేట సబ్‌స్టేషన్ అడ్డుమండ ఫీడర్ పరిధిలోని సన్యాసమ్మపాలెం, బారపల్లి, కొంతేలి, పెదబయలు మండలం సబ్‌స్టేషన్ పెదబయలు రూరల్ ఫీడర్ పరిధిలోని చుట్టుమెట్ట, సీకరి, అరడకోట, గూడెం కొత్తవీధి మండలం సబ్‌స్టేషన్ కుంకుమపూడి ఫీడర్ పరిధిలోని చిన్న అగ్రహారం, పెద్ద అగ్రహారం, జి.మాడుగుల మండలం సబ్‌స్టేషన్ సొలభం ఫీడర్ పరిధిలోని సొలభం, పెదలోచలి, గడుతూరు, వంతల, కొయ్యూరు మండలం సబ్‌షేషన్ కొయ్యూరు రూరల్ ఫీడర్ పరిధిలోని బూదరాళ్ల, రేవళ్లు, డుంబ్రిగుడ మండలం సబ్ స్టేషన్ కించుమండ ఫీడర్ పరిధిలోని పోతంగి, రంగిలసింగి, లైగండ, కంద్రుం, అనంతగిరి మండలం భీమవరం సబ్ స్టేషన్ భీమవరం టౌన్ ఫీడర్ పరిధిలోని గుమ్మకోట, భీంపోలు గ్రామాల్లో పైన పేర్కొన సమయంలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులందరూ సహకారించాలని ఆయన కోరారు.

## మృతుడి కుటుంబానికి సాయం

గంగవరం: రాజవరం గ్రామంలో అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన తుంపల పరుశురాము అనే వ్యక్తి కుటుంబానికి సిటిజన్‌ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎస్. నిడమర్తి చిన్నబాబు సహకారం అందించారు. రాజవరం గ్రామంలో సంస్థ కార్యదర్శి నిడమర్తి సుజాత, సూరంపాలెం సర్పంచ్ బల్లెం శివదొర చేతుల మీదుగా మృతుడి కుటుంబానికి 50 కేజీల బియ్యం, రెండువేలు రూపాయలు ఆర్థిక సాయమందించారు. రెండు సంవత్సరాల క్రితం అగ్ని ప్రమాదంలో తుంపల పరుశురాము కుటుంబం సర్వం కోల్పోయింది. ఆ కుటుంబానికి తీరని లోటు అని ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు తమ సంస్థ ద్వారా సాయమందించినట్లు సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎన్. నిడమర్తి చిన్నబాబు తెలిపారు.



మృతుడి కుటుంబానికి సాయిమందిస్తున్న దాత డాక్టర్ చిన్నబాబు, సర్పంచ్ శివ దొర తదితరులు

## అమ్మవారి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగిలో నూకాలమ్మ జాతర మహోత్సవాలు శుక్రవారం నుంచి అంగరంగ వైభవంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు జరిగాయి. నాలుగు రోజుల పాటు ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీ. ఉగాది రోజున గుడి తలుపులు మూసివేస్తారు. ఈనెల 28వ తేదీ నుంచి ఏప్రిల్ ఒకటవ తేదీ వరకు అమ్మవారి సంబరాలు జరుపుతున్నట్లు సర్పంచ్ రమణి, ఎంపీటీసీ సభ్యుడు పెద్దిరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మూడు రోజులపాటు జాగారాలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు గరగ నృత్యాలు, కోలాటం వంటివి ఏర్పాటుచేసినట్టు చెప్పారు. పిల్లల కోసం ఎగ్జిబిషన్‌లో జెయింట్ వీల్ వంటి ఏర్పాట్లు చేశామన్నారు. ఊరంతా విద్యుద్దీపాలతో అలంకరించారు. దాదాపు 200 గ్రామాల నుంచి లక్షకు పైగా భక్తులు ఈ ఉత్సవాలకు తరలివస్తారని అంచనా వేస్తున్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



నూకాలమ్మ అమ్మవారు

## సకాలంలో ధ్రువపత్రాల జారీకి చర్యలు

చింతపల్లి: మండలంలో ప్రతి పంచాయతీలో లబ్ధిదారులకు సకాలంలో ధ్రువపత్రాలను అందించేందుకు సిబ్బంది చర్యలు చేపట్టాలని ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ రవికుమార్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, డిజిటల్ అసిస్టెంట్‌లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. అర్హులకు ధ్రువపత్రాలను కాలయాపన చేయకుండా సకాలంలో అందజేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, డిజటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు, పక్కన తహసీల్దార్ రవికుమార్, డీటీ చంద్రశేఖర్

## కాంట్రాక్టర్‌పై చర్యలకు డిమాండ్

ముంచంగిపుట్టు: కర్రిముఖిపుట్టు పంచాయతీ వెచ్చంగి గ్రామంలో జేజేఎం ద్వారా తాగునీటి పనులు పూర్తి చేయకుండా నిధులు మార్చిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం నేతలు నారాయణ, జీనబంధు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్యయాత్ర కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, జేజేఎం ద్వారా పనులు పూర్తి కాలేదని, కూలి ఇవ్వకుండా కాంట్రాక్టర్ తమను ఇబ్బంది పెడుతున్నట్టు నేతల దృష్టికి సమస్యను స్థానికులు తీసుకొచ్చారు. సీపీఎం నేతలు నారాయణ, జీనబంధులు మాట్లాడుతూ పనులు ప్రారంభించి ఏడు నెలలు కావస్తున్నా నేటికి పూర్తి చేయలేదని, తాగునీటి కోసం గ్రామస్తులు అవస్థలు పడుతున్నారన్నారు. పనులు చేసిన కూలీలకు సైతం డబ్బులు ఇవ్వకుండా వెళ్లి పోవడం తగదని, తక్షణమే అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురుమూర్తి, చలపతి, భీమరాజు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీపీఎం నేతలు